# స్పర్శ

కాలానికున్న శక్తేమిటో ఈరోజున అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఇన్ని రోజులూ కత్తికున్న ఓవైపు మాత్రమే చూశాను. ఇవాళ బాగా అర్థం అయింది కత్తికి అవతలివైపున ఎలా వుంటుందో. నేను ఓ డాక్టర్‌ని. పొద్దున్న నా కడుపులో ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో భరించలేని నొప్పితో, మంచంమీద వున్నాను.

సముద్రం ఎండిపోవచ్చు అనడానికి కచ్ ప్రాంతం చూస్తే నమ్ముతారు. ఊళ్ళకు ఊళ్ళే నేలమట్టం అవుతాయనడానికి నిదర్శనం మెహంజొదారో. నా విషయంలో అదే జరిగింది. ఓ సర్జన్‌కి కడుపులో సర్జరి.

ఎంతోమందికి ఆపరేషన్ చేసిన నేను, ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. ఏదో తెలీని భయం. ఇలాంటి భయం ఇదివరకు రోగుల కళ్ళల్లో వుండిందా చూడలేదు. పట్టించుకోలేదు. నా చేతిని పట్టుకునేందుకు వాళ్ళు చేసే ప్రయత్నాలు, ఆ కళ్ళల్లో సందేహాలు యిప్పుడు అర్థం అవుతున్నాయి అవి ఓ ఆశ్వాసనకోసం, చిన్నపాటి ధైర్యంకోసం అని.

పేషెంట్ల చేతులు పట్టుకునే అలవాటు నాకు మొదట్నించి లేదు. ఆపరేషన్ చేసేటప్పుడు తప్పదు. అది వేరే విషయం.

అప్పుడు పేషంట్ మత్తులో వుంటాడు. స్పందనలు అవి ఏవీ వుండవు. నాకు అప్పుడు ఏమీ కనపడదు. ఆ ఎముక, ఆ మాంసం, ఆ ఆర్టరీలు, వెయిన్‌లు, నరాలు. పేటిస ఎలాగూ ముట్టుకోక తప్పదు. నా వృత్తి అది. నా దినచర్యలో అదో భాగం. ఆ టచ్‌వేరు.

నేను చదువుకునేప్పుడు నాకు ఎలా నేర్పారో ఏం నేర్పాలో అదే చేస్తుంటాను.

ఒక్కసారి మూలిగాను. నాకేం తెలీలేదు. కానీ బాధ. భరించలేని నొప్పి ఏదో శబ్దం రూపంలో బయటికొచ్చింది. అవే మూలుగులు. వాటిని వినడానికి యిష్టపడలేదు. కానీ, ఈ రోజున నేను మూలుగుతున్నాను. వారు వీరయ్యారు.

ఎవరైనా మూలుగుతూంటే, ఓ యంత్రంలా నా పని నేను చేసుకుపోయేవాణ్ణి. కానీ యిప్పుడు ఎవరైనా నా పక్కన కూచుని నా ఫీలింగ్స్‌ని పంచుకుంటే బావుణ్ణు అని అనిపిస్తోంది.

మత్తుగా వుంది...కళ్ళు మూసుకుపోతున్నాయి.

ఎవరెవరో వచ్చి వెళ్తున్నారు. వాళ్ల కదలికల్లోంచి వచ్చే సన్నటి శబ్దాలు ఎక్కడ్నించో వినిపిస్తున్నాయి.

"దుప్పటి సరిచెయ్యండి...ఆ ఇంజెక్షన్...అదో కాప్‌స్యూల్ నిద్రకి...ఏ.సి. తగ్గించండి..."

ఇలాంటి ఆజ్ఞలు నేనూ యిదివరకు జారీ చేశాను.

ఏవో ప్రశ్నలు అడగడానికి ప్రయత్నించేవాళ్ళని నర్సుల మీదకి వదిలేసేవాణ్ణి. నీట్‌గా షేవ్ చేసుకుని, పేషెంట్ మంచం దగ్గర నుంచుని కేస్ షీట్‌చూసి, మందులు మార్చడం, అవసరం అయిన పరీక్షలు లాటివి రాసి, నన్నంటిపెట్టుకున్న వాళ్ళకి చెప్పేవాణ్ణి. అంతేకానీ, పేషెంట్ మొహం చూడ్డానికే మాత్రం ప్రయత్నించేవాణ్ణికాదు.

కానీ...ఈరోజు...

ఈ తెల్లని గోడలున్న గదిలో...డెట్టాల్ వాసనతో నిండిన వాతావరణంలో...పడుకుని వున్నాను.

నేనిప్పుడు ఓ డాక్టర్ని కాదు.

ఓ పేషెంట్‌ని. పొద్దున్న ఆపరేషన్ అయింది.

నాకు పెళ్ళయింది. భార్యవుంది. యిద్దరు పిల్లలున్నారు.

ఇంటర్ ఫస్టియర్, ఇంటర్ సెకండియర్, బైపిసి తీసుకుని కాబోయే డాక్టర్లు వాళ్ళు.

ఇర్వింగ్ వాలెస్‌ని, జెఫ్రీ ఆర్చర్‌ని యిష్టపడతాను.

చలికాలం అంటే ఇష్టం. ఆకు రాలే కాలంలో, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ

దగ్గర్నుంచి, లైబ్రరీ వరకు చెట్లకింద నడుస్తూ వెళ్లడం అంటే యిష్టం. ఇలా ఎన్నో యిష్టాలున్న మనిషిని. ఎవరెవరో నన్ను హేండిల్ చెయ్యడం...భయంగా అనిపిస్తోంది.

యింతవరకు నాకు నొప్పి అన్నది పెద్దగా తెలీదు. కానీ యిప్పుడు అది అనుక్షణం నాకు నీడలా తోడుగా వుండిపోతున్నది.

ఏదో భయంగా వుంది. భయానికి చాలా కళ్ళు. గతంవైపే చూస్తున్నాయి.

నిద్రవచ్చేస్తోంది. కళ్ళు వాలిపోయాయి. రెప్పలు మూసుకుపోయాయి.

ఏవో దృశ్యాలు. మొదటిసారి చచ్చిపోతున్న రోగి. భయంకరంగా నాలుక ముందుకొచ్చి, లోపలికి పోయే తీరు, నిశ్చలంగా గోలీకాయల్లా వున్న గుడ్లు...కళ్ళు తిరిగిపోయాయి...అది చదువుకునే రోజుల్లో...

ఏదో నచికేతుడంటే యముడి దగ్గరికెళ్ళి వచ్చాడు. అక్కడ జ్ఞానాన్ని యోగనిద్ర అంతటిని ఉపదేశంపొంది. అన్ని మాలిన్యాలనీ పోగొట్టుకుని, మృత్యురహితుడై పోయాడు...కానీ...అది అందరికీ సాధ్యం అవుతుందా...పొగలు...మేఘాలు...

యమధర్మరాజు దున్నపోతునెక్కి నావైపుగా వస్తున్నట్లుగా అనిపించింది. పక్కనే చిత్రగుప్తుడున్నాడు. బ్రహ్మానందం కావచ్చు, బాబూమోహన్ కావచ్చు. మేఘాల్లోంచి దిగుతూ నావైపుగానే వస్తున్నారు. పరిగెత్తాను. కానీ..అమ్మో!...

"డాక్టర్..."

మెల్లిగా తట్టి లేపించి సిస్టర్.

ఏదో మాత్ర, మంచినీళ్ళు యిచ్చింది సిస్టర్.

మళ్ళా కళ్ళు మూతలుపడ్డాయి. మరోదృశ్యం.

"డాక్టర్ ఎలాగైనా బతికించండి, ఎంత డబ్బయినా ఫర్వాలేదు."

"అలాగే...మా శాయశక్తులా...అలాగే..."

కానీ, ఆ అలాగే వర్కవుట్ అవలేదు. ఆ పేషెంట్ చనిపోయాడు. అందరూ ఒక్కసారిగా ఏడుపు....అమ్మో!

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. ఒకణ్ణే మంచంమీద...నిశ్శబ్దంగా వున్న గదిలో భయంగా అనిపిస్తోంది.

"మేమంతా వున్నాం. మీరు ఎవరూ వద్దు. అసలేమాత్రం డిస్టర్బెన్స్ వుండకూడదు. రేపట్నించి మీరంతా రావచ్చు. రాత్రి వుండచ్చు. కానీ ఈ ఇరవయి

నాలుగ్గంటలు మా పర్యవేక్షణలో వుండాలి" ఎవర్నీ వుండనివ్వలేదు. అందుకే ఒక్కణ్ణే...ఇలా...ఈ గదిలో...మంచం మీద...

కళ్ళు మూసుకున్నాను. ఏవో దృశ్యాలు

ఆపరేషన్ చేస్తున్నాను...సక్సెస్... ...మర్నాడు ఏవో కాంప్లికేషన్స్ డెవలప్ అయ్యాయి. పోయాడు. ఆరోజున ఏదో మామూలు విషయంలా తీసుకున్న నాకు...ఇవ్వాళ ఎందుకో భయం! పేషెంట్...ఎక్కడికో వెళ్ళి పోతున్నాను...ఎక్కడికీ?

కొండలు కోనలూ, వాగులు నదూలూ, తిప్పలు తిన్నెలు, పర్వతాలు సముద్రాలు...సముద్రాన్ని ఆకాశాన్ని వేరుచేస్తున్న గీత...ఎంతసేపు అలా వెళ్ళానో తెలీలేదు. ఏవో స్పర్శలు. ఎవరూ? నా పేషెంట్లా! ఉహూ...పరీక్షలు...డ్యూటీ సిస్టర్స్ వాళ్ళ పని వాళ్ళు చేసుకుపోతున్నారు. మళ్ళా హాస్పిటల్...నా నొప్పి...కొంచెంగా తెలుస్తోంది. రిపోర్టులు రాస్తున్నారు.

బైట మాటలు వినిపడ్తున్నాయి.

రైలు కూతలు, బస్సు వాహనాల రొదలు వినపడ్తున్నాయి.

షిఫ్ట్ మార్పు. నా రూంలో కూడా హడావిడీ.

ఖడక్‌గా...గంజిపెట్టిన యూనిఫారాల్లో వున్న స్టాఫ్ మళ్ళామళ్ళా వచ్చిపోతున్నారు.

నా దగ్గర వచ్చి నుంచుంది ఆమె.

నల్లగా వున్న ఆ సిస్టర్ వచ్చి దుప్పటి సరిచేసింది.

తలగడని అన్నివైపులా నొక్కి నొక్కి గుండు గుండులా చేసి తలకింద పెట్టింది. ఎఫీషియెంట్ సిస్టర్. ఈ హాస్పిటల్ ఎఫీషియెన్సీకి పెట్టింది పేరు.

ఏసి అడ్జస్ట్ చేసింది.

బ్లైండ్స్‌ని తెరిచింది. కర్టెన్ సరిచేసింది.

గుమ్మం వరకూ వెళ్ళింది. మళ్ళా ఏదో గుర్తొచ్చినట్లుగా లోపలికొచ్చింది. నాప్‌కిన్ తీసుకెళ్ళింది పక్కనే వున్న బాత్రూంలోకి.

ముఖాన్ని తుడిచింది.

చిరునవ్వు చెదరడం లేదు.

"నొప్పిగా వుండేమో కదా!" కొత్తపదాలు! మనస్సుని స్పృశించాయి.

'నొప్పిగా ఉందా!''

అదొక్కటే మాట ఆమె నాతో అన్నది.

ఎందుకో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఆ మాటలకి ఎంత శక్తి!

బాధ, నొప్పి అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

ఆమె నా బాధని, నా భావాల్ని అర్థం చేసుకుని, తన పలకరింపుతో నా బాధ బరువు తగ్గినట్లుగా అనిపించింది.

ఆ మనిషి ఒక్కక్షణం తీసుకుని నా బాధని అర్థం చేసుకుని అనగలిగింది. నొప్పిగా వుందేమో కదా! మాటలకెంత శక్తి!

ఆ చర్మం కింద మానవతా పరిమళం. అద్భుత సౌందర్యం.

ఆరోజు రొటీన్‌లో చిన్న మార్పు కనపడింది...కాదు...వచ్చింది.

నా నాడి చూస్తున్నప్పుడు కాదు.

నా బి.పి. చూస్తున్నప్పుడు కాదు.

నా నోట్లో థర్మామీటరు పెట్టినప్పుడు కాదు.

నాకు మందు, మాత్రా యిచ్చినప్పుడూ కాదు.

ఆమె అన్న మాటలు...గుండెల అడుగున, లోతుల్లో, ఎక్కడో స్పృశించింది.

ఆమె మాటలు దేవుడు అన్నట్లుగా అనిపించింది.

మనిషి తెలిపే దిక్సూచిలాగా అనిపించింది.

ఆ తర్వాత నేను ఏ పేషెంటునైనా పరీక్ష చేస్తున్నప్పుడూ నాలోని మనిషి జీవించడం మొదలెట్టాడు. శరీరాన్నికాదు, ఓ మనిషిని పట్టుకున్నట్టుగా ముట్టుకున్నట్టుగా అనిపించేది.

స్టెత్ పెట్టినప్పుడు వాళ్ళ కళ్ళల్లో భావాలు నాకు వినపడేవి గుండె చప్పుళ్ళలోంచి ఏం పర్వాలేదు. తగ్గిపోతుందన్నట్టుగా బుజాన్ని తట్టి అనడం నేర్చుకున్నాను.

నా జీవశక్తిని అమృతంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాను.

అందుకే కదా మృత్యోర్మా అమృతంగమయ అన్నది.

✧ *23.6.2004* నవ్య వారపత్రిక✧